క్లుప్తంగా

పంచాయతీ కార్మికులకు రెయిన్‌కోట్లు



రెయిన్‌కోట్లను అందజేస్తున్న సర్పంచ్ ముదికుప్పం రూప రామ్మూర్తి, దాత మునిరత్నం రాయల్

చంద్రగిరి: మూడు రోజులుగా చంద్రగిరిలో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు పంచాయతీ కార్మికులు విధి నిర్వహణలో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇది తెలుసుకున్న మల్లయ్యపల్లెకు చెందిన మునిరత్నం రాయల్ రూ.35వేల విలువ చేసే రెయిన్‌కోట్లను బుధవారం సర్పంచ్ ముదికుప్పం రూప రామ్మూర్తి ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులకు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓ మహేశ్వరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో పంచాయతీల పాత్ర కీలకం



మాట్లాడుతున్న ఎంపీడీఓ గిడ్డయ్య

భాకరాపేట: గ్రామాభివృద్ధిలో పంచాయతీ ఉప సర్పంచులు, వార్డు సభ్యుల పాత్ర కీలకమని చిన్నగొట్టిగల్లు ఎంపీడీవో గిడ్డయ్య అన్నారు. బుధవారం రెండో రోజు ఉప సర్పంచ్, వార్డు సభ్యులు శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. గ్రామ పంచాయతీలో జరిగే అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ సోమశేఖర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి



మాలవాని చెరువును సందర్శించి వస్తున్న తహసీల్దార్, ఇరిగేషన్ అధికారులు

చంద్రగిరి: మూడు రోజులుగా మండల వ్యాప్తంగా కురుస్తున్న వర్షాల కారణంగా అధికారులందరూ అప్రమత్తంగా వ్యవహరించాలని తహసీల్దార్ శివరామ సుబ్బయ్య కోరారు. బుధవారం ఆయన మండలంలోని రాగిమానుకుంట, మూలపల్లె చెరువు, దుర్గం ఎస్టీ కాలనీ, మాలవాని చెరువులను సందర్శించారు. ఎస్టీ కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిశీలించి వారికి కావాల్సిన సహాయక కార్యక్రమాలను చేపట్టాలని రెవెన్యూ యంత్రాంగాన్ని ఆదేశించారు. మూలపల్లె చెరువు స్థితి ఎలా ఉందో ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అరిగెలవారిపల్లె సమీపంలోని మాలవాని చెరువుకు వస్తున్న వరద నీటిని పరిశీలించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను ఇప్పటికే అప్రమత్తం చేశామన్నారు.

ఎముకల పటుత్వ పరీక్షల వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ దినేష్‌కుమార్

తిరుపతి తుడా: తిరుపతిలోని దినేష్ కల్పనా ఆస్పత్రిలో బుధవారం ఎముకల పటుత్వ, యూరిక్ యాసిడ్ పరీక్షల వైద్య శిబిరం నిర్వహించారు. దీనికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. సుమారు 100 మందికి పైగా రోగులకు డాక్టర్ దినేష్‌కుమార్ దొడ్ల వైద్య పరీక్షలు చేశారు. ఆయన మాట్లాడుతూ 40 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఎముకల సాంద్రత పరీక్షలు చేసుకుని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు కల్పన, మనోహరి రామచంద్ర ఆస్పత్రి వైద్యులు డాక్టర్ మనోహరి, హర్ష, చరిత, గోపికృష్ణ, కీర్తి తదితరులు పాల్గొన్నారు

మండలాభివృద్ధికి సహకరించండి



మాట్లాడుతున్న ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి

చంద్రగిరి: మండలాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి కోరారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధ్యక్షత వహించి ఎంపీపీ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసే నిధులతో అన్ని పంచాయతీలు మౌలిక వసతులను సమకూర్చుకోవాలన్నారు. విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్లపై వర్షపు నీరు, కాలువల్లో మురుగు నిల్వ ఉండకుండా చూడాలని, వాటర్ హెడ్ ట్యాంకులను తరచూ శుభ్రం చేయాలని కోరారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శేఖర్, తహసీల్దార్ శివరామ సుబ్బయ్య, కో–ఆప్షన్ సభ్యుడు ఔరంగజేబు, అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

సాయం కోసం ఎదురుచూపు

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- మురుగు కాలువలు పొంగి రోడ్లపై ప్రవాహం
- ఇళ్లల్లోకి నీరు చేరి అవస్థలు పడుతున్న జనం
- పునరావాస కేంద్రాలకు తరలించడంలో అధికారులు విఫలం





ఇళ్లల్లోకి నీళ్లు రావడంతో నీటిని బయటకు తోడి సామగ్రిని భద్రపరుస్తున్న బాధితులు , పూలవానిగుంట, కాటన్ మిల్లు వద్ద ఇళ్లల్లోకి చేరిన వర్షపు నీరు

తిరుపతి తుడా: తుపాను ప్రభావం తిరుపతి నగరాన్ని అతలాకుతలం చేస్తోంది. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నగరంలోని ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇళ్లలోకి పెద్ద ఎత్తున నీరు చేరడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. సహాయం కోసం ఎదురుచూస్తున్నా వారిని పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ముందస్తు హెచ్చరికలు తమకు చేరవేయలేదంటూ లోతట్టు ప్రాంత ప్రజలు వాపోతున్నారు. మరోవైపు సుమారు 17 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని అధికారులు చెబుతున్నా మొక్కుబడిగా చర్యలు తీసుకున్నారని బాధితులు మండిపడుతున్నారు.

డ్రైనేజీ నీటితో వాగులను తలపించిన రహదారులు

భారీ వర్షాలకు నగరంలోని ప్రధాన రహదారులు మురుగు కాలువలు పొంగి వాగులను తలపించేలా రోడ్ల మీద ప్రవహిస్తున్నాయి. లీలామహల్ రోడ్డు నుంచి కరకంబాడి వెళ్లే రోడ్డులో వర్షపు నీటితో పాటు, డ్రైనేజీ నీరు పెద్ద ఎత్తున ప్రవహించడంతో ప్రజలు నానా అగచాట్లు పడ్డారు. వాహనదారులు కష్టాలు వర్ణనాతీతం. అలాగే, జీవకోనలోని కొన్ని కాలనీలు, కొత్తపల్లె లోతట్టు ప్రాంతం, కొరమేనుకుంట, లక్ష్మీపురం, గొల్లవానికుంట, పూలవానికుంట, ఆటోనగర్, కాటన్‌మిల్, వేశాలమ్మ గుడి వీధి, కోర్టు ప్రాంగణం, రుయాసుపత్రి ప్రాంతాలు దాదాపు నీటమునిగిన పరిస్థితి కలిగింది.

పునరావాస కేంద్రాల సమాచారమేదీ?

నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలపై లోతట్టు ప్రాంత ప్రజలకు తెలియజేయడంలో అధికారులు, సిబ్బంది విఫలమయ్యారు. పూలవానికుంట, గొల్లవానికుంట ప్రాంతాలలో ఇళ్లలోకి నీరు చేరడంతో పిల్లలను చంకన పెట్టుకుని మోకాలు లోతు నీళ్ల నడుమ ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లారు. పునరావాస కేంద్రాల గురించి ఎవరూ తమకు చెప్పలేదని వాపోయారు. చిన్నపిల్లలతో పాటు వృద్ధులు వర్షపు నీటితో నిండిపోయి ఇళ్లను దాటిరావడం కష్టతరమైంది. అధికారులు ఏర్పాటు చేసి పునరావాస కేంద్రాలు ఖాళీగా దర్శనమిచ్చాయి. రెండు మూడు ప్రాంతాలలో కొంతమంది బాధితులు మాత్రమే పునరావాస కేంద్రాలకు తరలివెళ్లారు. పలుమార్లు హెల్ప్‌లైన్‌ను సంప్రదించినా ఇదిగో..అదిగో వస్తున్నాం అంటూ సమాధానం ఇవ్వడం తప్పితే ఆదుకున్న పాపానపోలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

పునరావాస కేంద్రాలివే

నగరంలోని 17 ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోస్టల్ కాలనీలోని పార్వతీపురం, నగరపాలక సంస్థ పాఠశాల, మంగళం తుడా క్వార్టర్స్ వద్ద ఎంపీపీ స్కూల్, కొత్తపల్లె, ప్రైమరీ స్కూల్, కొరమేనుగుంట రాజీవ్‌గాంధీ స్కూల్. ఆర్ఎస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్, మధురానగర్‌లోని ఎంఎస్‌యూపీ స్కూల్, ప్రియదర్శిని ఇంగ్లిష్ మీడియం స్కూల్, సంజయ్‌గాంధీ కాలనీలోని ఎంయూపీ స్కూల్, సత్యనారాయణపురంలో జెడ్పీ హైస్కూల్, కెనడీనగర్‌లోని డి– అడిక్షన్ సెంటర్, ఎర్రమిట్టలోని రత్నం, చైతన్య స్కూల్, సింగాలగుంట మునిసిపల్ స్కూల్, ఉప్పంగి హరిజనవాడ మునిసిపల్ స్కూల్, యశోదానగర్‌లో లిటిల్ ఎంజిల్ స్కూల్, బైరాగిపట్టెడలో రా మానాయుడు స్కూల్, ఎల్‌బి.నగర్‌లో కేశవరెడ్డి స్కూల్, వేశాలమ్మ గుడి వీధిలో ఇందిరానగర్ స్కూల్.

లోతట్టు ప్రాంతాలు

రైల్వేకాలనీ, స్కావెంజర్స్ కాలనీ, ఎర్రమిట్ట, మాధవ్‌నగర్, జీవకోన, శివజ్యోతినగర్, సుబ్బారెడ్డి నగర్, చంద్రశేఖర్‌రెడ్డి కాలనీ, అక్కారంపల్లె, కొత్తపల్లె, కట్టకిందపల్లె, కొర్లగుంట, రేణిగుంట రోడ్డు, ఆటోనగర్, కొరమేనుగుంట, గొల్లవానిగుంట, పూలవానిగుంట, కాటన్‌మిల్, బ్లిస్ హోటల్ సర్కిల్, లక్ష్మీపురం, ఎయిర్ బైపాస్‌రోడ్డు, ఎస్టీవీనగర్, పాత తిరుచానూరు రోడ్డు, పద్మావతి పురం, ముత్యాలరెడ్డిపల్లెలోని పలు కాలనీలు, యాదవకాలనీ, డీఆర్ మహల్ ఏరియా, పళని థియేటర్, గాంధీపురం.



ఆయిల్ మిల్ వీధిలో ఇళ్ల వద్ద చేరిన వర్షపు నీరు



పూలవానిగుంటలో ఇళ్లల్లోకి చేరిన వర్షపు నీరు



ఆయిల్ మిల్ వీధిలో మోకాలి లోతు నీటిలో వెళుతున్న యువకుడు



మోకాలి లోతు వర్షపు నీటిలో గొడుగులతో జోరు వానలో వెళుతున్న ప్రజలు



పూలవానిగుంట గొల్లవానిగుంటలో పొంగిపొర్లుతున్న పెద్దకాలువలు



తిరుపతి మంగళం : వర్షాలకు పొంగిపొర్లుతున్న చెన్నాయగుంట చెరువు

వరద ముంపులో కేబీఆర్ నగర్



కేబీఆర్‌నగర్ వద్ద ఉన్న పెద్దకాలువలో పొంగిపొర్లుతున్న వరదనీరు



భోజన ఏర్పాట్లు చేస్తున్న శివశంకర్‌రాజు

– కల్వర్టు నిర్మిస్తామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే
– బాధితులకు వైఎస్సార్ సీపీ నేత సాయం

తిరుపతి మంగళం: తుపాను ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మంగళం తిరుమల నగర్ పంచాయతీలోని కేబీఆర్‌నగర్ వరదనీట మునిగింది. కేబీఆర్ నగర్ వద్ద పెద్ద కాలువ ఉంది. మంగళం పంచాయతీలలోని మురుగునీటితో పాటు వరద నీరు ఆ కాలువ గుండా అన్నాసాంపల్లె చెరువుకు చేరుతుంది. అయితే పెద్దకాలువ గుండా వచ్చే వరదనీరు పొంగి కేబీఆర్ నగర్‌లోకి చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కల్వర్టు నిర్మిస్తాం

కేబీఆర్ నగర్ వద్ద ఉన్న పెద్ద కాలువకు కల్వర్టు నిర్మించి వరద ముంపు లేకుండా చేస్తానని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని హామీ ఇచ్చారు. కేబీఆర్ నగర్‌లో చేరిన వరదనీటిని బుధవారం ఆయన పరిశీలించారు. ఏళ్ల కాలంగా తామీ సమస్యను ఎదుర్కొంటున్నట్టు స్థానికులు ఆయన దృష్టికి తీసుకురాగా, ఎమ్మెల్యే పైవిధంగా స్పందించారు.

ముంపు బాధితులకు వసతి, భోజనం

వరద ముంపునకు గురైన కేబీఆర్ నగర్ వాసులకు తిరుమలనగర్ పంచాయతీ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ గుండ్రాజు శివశంకర్‌రాజు తిరుమలనగర్ పంచాయతీ వద్ద బస, భోజన వసతి కల్పించారు. ఎలాంటి విపత్తు వచ్చినా తనవంతు సాయం అందిస్తానంటూ ఆయన ముందుకొచ్చారు. అలాగే దుప్పట్లు, చాపలు సైతం ఇచ్చారు.

జలపాత ఝురి..చూసొద్దాం మరి



తిరుపతిలో రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి శేషాచల పర్వత సానువుల్లో తీర్థాలు హోరెత్తుతున్నాయి. వరుణుడు ధాటికి తిరుపతి కపిలతీర్థంలో జలపాతం సరికొత్త సోయగాలు చిందిస్తోంది. జలపాత సవ్వడి బుధవారం భక్తులకు కనువిందు చేసింది. ఈ దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది. -సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

నూతన ఆవిష్కరణలకు యువత ఆలోచనలే కీలకం



గ్రాడ్యుయేషన్ పట్టభద్రులతో శ్రీ పద్మావతి మెడికల్ కాలేజీ ఫర్ ఉమెన్ ఫార్మకాలజీ విభాగాధిపతి, ప్రిన్సిపల్ తదితరులు

రామచంద్రాపురం: నూతన ఆవిష్కరణలకు యువతరం ఆలోచనలే కీలకమని శ్రీ పద్మావతి మెడికల్ కాలేజీ ఫర్ ఉమెన్ ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ ఉమామహేశ్వర్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని వెంకట్రామాపురం సమీపంలోని సెవెన్‌హిల్ ఫార్మసీ కళాశాలలో పట్టభద్రుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు నైతిక విలువలతో పాటు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాన్నారు. అనంతరం ప్రిన్సిపల్ డాక్టర్ నిరంజన్‌బాబు మాట్లాడారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు ఫార్మా–డీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో శ్రీ వేదనారాయణ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ దినకర్‌బాబు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కోర్టు విధులకు హాజరవుదాం

తిరుపతి లీగల్ : తిరుపతి మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు విధులకు గురువారం నుంచి హాజరుకావాలని బుధవారం న్యాయవాదులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ కోర్టులో సివిల్ జడ్జి న్యాయవాది ఉమాపతితో అమర్యాదగా వ్యవహరించారంటూ ఆయన ఫిర్యాదుతో న్యాయవాదుల సంఘ కార్యవర్గ సభ్యులు గతవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అలాగే విధులకు హాజరు కారాదని తీర్మానించారు. దీనిపై బుధవారం న్యాయవాదులు తిరిగి సర్వసభ్య సమావేశం నిర్వహించి చర్చించారు. ఆ కోర్టు విధులకు తాత్కాలికంగా హాజరు కావాలంటూ నిర్ణయం తీసుకున్నారు. సమావేశంలో తిరుపతి న్యాయవాదుల సంఘం అధ్యక్షులు గోపిచంద్, ప్రధాన కార్యదర్శి మార్టిన్, సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

తిరుచానూరులో భారీ వర్షం



చంద్రగిరి(తిరుచానూరు): తుపాను ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తిరుచానూరు పంచాయతీ వీధులు, రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీళ్లు, పాల ప్యాకెట్లను తీసుకోవాలన్నా మోకాళ్లలోతు నీళ్లలో వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. భారీ వర్షాలు కురిసిన ప్రతిసారీ లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయని, ఎన్నోసార్లు అధికారులకు తెలిపినా చర్యలు తీసుకోవడం లేదంటూ మండిపడ్డారు. పొన్నకాలువ సమీపంలోని వసుంధర నగర్ రోడ్డుపై నీళ్లు చేరడంతో వాహనదారులు, పంచాయతీ కార్యాలయం పక్క వీధిలో భారీగా నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.